యాదగిరిగుట్ట ప్రధానాలయంలో భక్తుల క్యూ

భక్తజన సంద్రంగా యాదగిరిగుట్ట క్షేత్రం

యాదగిరిగుట్ట, ఏప్రిల్14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్య క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగంణం కిక్కిరిసిపోయింది. తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారింది. స్వామివారి ధర్మదర్శనానికి 3 గంటలు, వీవీఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు వెల్లడించారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. తెల్లవారు జూమూనే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. స్వామివారిని తెల్లవారుజామున మేల్కొలిపిన అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. లక్ష్మీసమేతుడైన స్వామివారిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణతంతు జరిపారు.

పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా జరిగాయి. అనుబంధ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామి వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ఖజానాకు రూ.61,77,746 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

గురుకుల విద్యార్థులకు కొనసాగుతున్న చికిత్స

గురుకుల పాఠశాలలో విచారణ జరుపుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 14 : భువనగిరి పట్టణ పరిధిలోని గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థులకు చికిత్స కొనసాగుతున్నది. ఆదివారం మరో ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. శనివారం వరకు 15 మందికి పైగా చికిత్స పొందగా, ఆదివారం ఆరుగురికి చికిత్స అందించారు. అలాగే భువనగిరి ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న ఆరుగురితోపాటు మరో 10 మంది చికిత్స పొందుతున్నారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యాధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురు విద్యార్థులకు గానూ ఇద్దరు విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉండగా సీహెచ్ ప్రశాంత్ వెంటిలేషన్‌పై చికిత్స పొందుతున్నాడు.

పాఠశాలను సందర్శించిన జిల్లా అధికారులు

గురుకుల పాఠశాలను అదనపు కలెక్టర్ గంగాధర్, ఆర్డీఓ అమరేందర్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం సందర్శించి చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. సంఘటన తీరుపై విద్యార్థులతోపాటు అధికారులను విచారించారు. వంటలు, వంట పాత్రలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ గంగాధర్ మాట్లాడుతూ సంఘటనపై సమగ్ర విచారణ నిర్వహించామని, పై అధికారులకు నివేదికను సమర్పించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే పరామర్శ..

ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న 10 మంది విద్యార్థులను ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. అనంతరం పాఠశాలలో చికిత్స పొందుతున్న ఆరుగురు విద్యార్థులను సైతం ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. పాఠశాలలోని వంటగదితోపాటు వంట సామగ్రి, డార్మెటరీ గదిని పరిశీలించారు.

భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

చౌటుప్పల్, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. ఆదివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు. స్వాతంత్ర్యానంతరం దేశ పరిస్థితులకు అనుగుణంగా అంబేద్కర్ భారత రాజ్యాంగాన్ని తయారు చేస్తే ప్రస్తుతం మోదీ అడుగుఅడుగునా తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దోనూరి నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు బూర్గు కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి గంగదేవి సైదులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న డీసీఎం పట్టివేత

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 14 : గోవులను కబేళాకు తరలిస్తున్న డీసీఎంను పట్టుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన భూదాన్‌పోచంపల్లి మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం నుంచి హైదరాబాద్‌లోని జియాగూడకు 33 గోవులను డీసీఎంలో తరలిస్తుండగా మండలంలోని జగత్‌పల్లి శివారులో డీసీఎం అదుపుతప్పి ఒక పక్కకు ఒరిగిపోయింది. క్రేన్ సాయంతో వాహనాన్ని తీస్తుండగా కొంతమంది యువకులు వాహనంలో ఉన్న గోవులను గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వెంటనే గ్రామానికి వచ్చి నిందితులు బానోతు అశోక్, అశ్వక్‌ను అదుపులోకి తీసుకున్నారు. డీసీఎంను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 14 : మండలంలోని లింగరాజుపల్లిలో ఆదివారం విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి ప్రాంతానికి చెందిన ఓ రైతు లింగరాజుపల్లిలోని రైతుల వద్ద గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై భువనగిరికి తరలిస్తుండగా గ్రామంలోని వైకుంఠధామం సమీపంలో విద్యుత్ తీగలు తగిలి గడ్డితోపాటు ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైనట్లు తెలిపారు.

లింగరాజుపల్లిలో విద్యుత్ తీగలు తగిలి దగ్ధమవుతున్న గడ్డి ట్రాక్టర్

భావితరాలకు స్ఫూర్తి ప్రదాత బీఆర్ అంబేద్కర్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు
- పల్లెపల్లెనా అంబేద్కర్ జయంతి వేడుకలు

భువనగిరి సిటీ : అంబేద్కర్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు



యాదగిరిగుట్ట : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

మోత్కూరు : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 14 : భావితరాలకు స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు అన్నారు. ఆదివారం భువనగిరిలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా విద్యా శాఖ, జిల్లా ఎస్సీ షెడ్యూల్ శాఖ, రోటరీ క్లబ్ భువనగిరి సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కోర్టు ఆవరణలో 'భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులు విధులు- అంబేద్కర్ కృషి అంశాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ రచనలో ఎనలేని కృషి చేసి ప్రపంచ మేధావిగా వెలుగొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి దశరథ రామయ్య, భువనగిరి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, డీఈఓ నారాయణరెడ్డి, ఎస్సీడీఓ జైపాల్‌రెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు హరినా, ఉపాధ్యక్షులు జయ, కార్యదర్శి కృష్ణ, కోశాధికారి శివకుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, కార్యదర్శి నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రభుత్వ న్యాయవాది నాగారం అంజయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పూలమాల వేసి నివాళి అర్పించారు. మోత్కూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ నివాళి అర్పించారు. అలాగే భువనగిరిలో అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ హనుమంతు కె.జెండగే, అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్, ఆర్డీఓ అమరేందర్, అధికారులు నివాళులర్పించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిదులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, దళిత, కుల సంఘాలు, వివిధ పార్టీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

భువనగిరి సిటీ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, పక్కన అదనపు కలెక్టర్లు

ఆత్మకూరు(ఎం) : అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దండోర, బీసీ సంఘాల నాయకులు

తుర్కపల్లి : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ సుశీలారవీందర్

సంస్థాన్‌నారాయణపురం : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ ఉమాదేవి, నాయకులు

మోత్కూరు : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బాబూరావు

భూదాన్‌పోచంపల్లి : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

రామన్నపేట : అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ బాలమణి



మోటకొండూర్ : మండల కేంద్రంలో అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాలు, పార్టీల నాయకులు

చౌటుప్పల్ : లింగోజిగూడెంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో..

ఆలేరు రూరల్ : కొలనుపాకలో అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

రాజాపేట : జాల గ్రామంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అడ్డగూడూరు : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఉషారాణికి ఉగాది పురస్కారం

ఉగాది పురస్కారం అందుకుంటున్న ఉషారాణి

మోత్కూరు, ఏప్రిల్ 14 : మున్సిపాలిటీకి చెందిన రేగోటి ఉషారాణి ఉగాది పురస్కారం పొందారు. ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడ పద్మశాలి భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం సాహిత్య విభాగం అధ్యక్షుడు చిక్క రామదాసు ఆధ్వర్యంలో కవి మిత్రుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం కార్యదర్శి రేగోటి ఉషారాణి కవితాగానం చేశారు. ఇందుకుగానూ ఆమెకు అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల జగన్నాథం, డాక్టర్ త్రివేణి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందజేశారు.

ఉషారాణికి పద్మశాలి సంఘం అధ్యక్షుడు పోచం భిక్షపతి, కార్యవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఉత్తరపల్లికి జ్యోతిష్య మహానంది అవార్డు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 14 : మండలంలోని మాండ్ర గ్రామంలో గల ఆంజనేయ స్వామి ఆలయ అర్చకుడు ఉత్తరపల్లి నరసింహాచార్యులకు జాతీయ స్థాయిలో మహానంది అవార్డును ఆదివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో త్యాగరాజ గానసభ కళావెంకట దీక్షితులు కళావేదిక చిక్కడపల్లిలో సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అద్దంకి క్రిష్ణమాచార్యులు, వివిధ రాష్ట్రాలకు చెందిన అవార్డు గ్రహీలు పాల్గొన్నారు.

మహానంది అవార్డు స్వీకరిస్తున్న నరసింహాచార్యులు

పుస్తెలతాడు చోరీ

ఆలేరు రూరల్, ఏప్రిల్ 14 : నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి బంగారు పుస్తెలతాడు చోరీ జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మండలం కందిగడ్డతండాకు చెందిన మాలోతు గోపినాయక్ అతని భార్య కవితతో కలిసి శనివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి గోడ దూకి ఆమె మెడలోని 4 తులాల బంగారు పుస్తెలతాడును ఎత్తుకెళ్లాడు. భార్యాభర్తలు దొంగను పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

చందంపేట(దేవరకొండ), ఏప్రిల్ 14 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు శనివారం అర్ధరాత్రి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు డీటీసీఎస్ హన్మంతు వెంకటేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండలం సారబండతండాకు చెందిన ఇస్లావత్ నవీన్ అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి కల్వకుర్తి ప్రాంతానికి తరలిస్తుండగా వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు దేవరకొండ మండలం ఇద్దంపల్లి శివారులో తనిఖీ చేయగా 50 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. ఈ మేరకు పట్టుబడిన బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాముకు తరలించి 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

- మరొకరికి గాయాలు

అడ్డగూడూరు, ఏప్రిల్ 14 : తాటిచెట్టు పైనుంచి కింద పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన చిన్నపడిశాలలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పూజారి యాదయ్యగౌడ్ రోజువారీ మాదిరిగానే ఆదివారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదశవత్తు జారి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సమీపంలోని రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

భూదాన్‌పోచంపల్లి : తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్‌కు చెందిన ఇటమోని బాలయ్య రోజువారీగా శనివారం రాత్రి తాటి చెట్టు ఎక్కిన క్రమంలో ఒక్కసారిగా కాలు జారడంతో కింద పడ్డాడు. అక్కడే ఉన్న వారు అతన్ని పోచంపల్లిలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపించారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎంపీపీ

విజేత జట్టుకు షీల్డ్ అందజేస్తున్న ఎంపీపీ రేఖాశ్రీధర్‌రెడ్డి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 14 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ దూదిపాల రేఖాశ్రీధర్‌రెడ్డి అన్నారు. అదివారం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు షీల్డ్‌తోపాటు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత ఆసక్తి పెంపొందించుకుని క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ టీమ్ మొదటి బహుమతి రూ.30 వేలతోపాటు షీల్డ్, మిర్యాలగూడ టీమ్ రెండో బహుమతి రూ.20 వేలతోపాటు షీల్డ్, మూడో బహుమతి హైదరాబాద్ టీమ్ రూ.15 వేలతోపాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, పస్నూరి యుగేంధర్‌రెడ్డి, కోట్ల జగదీశ్, రమావత్ రాజునాయక్, గంధం సురేశ్, పెద్దిశెట్టి సుధాకర్, నాయిని ప్రభాకర్ రెడ్డి, ఖైసర్‌ఖాన్, ముడావత్ మంగ్యానాయక్, బూడిద మల్లేశ్, అందుగుల వెంకటయ్య, భీంసింగ్, శేఖర్, సయ్యద్ హబీబ్, సయ్యద్ నదీమ్ పాల్గొన్నారు.